సాక్షి ఒడిశా

గురువారం । 12 । జూన్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

స్వామివారి బుధవారం ఆదాయం రూ. 3,73,410 - భువనేశ్వర్/పూరీ



భక్తుల సేవలో..! - 8లో


దేవస్నాన పూర్ణిమ సందర్భంగా పూరీ జగన్నాథ మందిరం వద్దకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగ భక్తులకు బొడొ దండొ సాథీ వలంటీర్లు ఆసరాగా నిలిచారు.

పిడుగుపాటుకు పశువులు మృతి



కళ్యాణసింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీ తొలొసొజ్జ గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మూడు పశువులు మృతి చెందాయి. - 8లో

వైభవం.. జగన్నాథుని స్నానోత్సవం





జయపురం: పూర్ణఘడ్‌లో జగన్నాథ్ బలభద్ర, సుభద్రలకు పూజలు చేస్తున్న పూజారులు

భువనేశ్వర్: శ్రీ క్షేత్రవాసుని స్నానోత్సవం కనులారా తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పూరీ తరలివచ్చారు. శ్రీ మందిరం ప్రహరి ఆనంద బజారు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సువిశాల మండపంపై చతుర్ధా మూర్తుల పవిత్ర స్నానోత్సవం బుధవారం వైభవోపేతంగా జరిగింది. బహిరంగ స్నాన మండపంపై అశేష భక్త జనం సమక్షంలో భగవంతుడు స్నానం ఆచరించే అపురూప దృశ్యంతో భక్తజన హృదయాలు పులకించాయి. ఆబాలగోపాలం మండుటెండలో ఉత్సవం ఆద్యంతాలు తిలకించారు.



జయపురం: పూర్ణఘడ్‌లో భక్తులకు దర్శనమిచ్చిన దేవతా మూర్తులు

జయపురంలో పోటెత్తిన భక్తజనం

జయపురం: జయపురం పట్టణం, పూర్ణాఘడ్‌లలో జగన్నాథ బలభద్ర, సుభద్రల స్నాన జాతర ఘనంగా నిర్వహించారు. జయపురం మహారాజులు మొదట కోట నిర్మించిన పూర్ణఘడ్‌లో 108 కలశాలతో దేవతామూర్తులకు అభ్యంగన స్నానం చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా దేవస్నాన పూర్ణిమ

పర్లాకిమిడి: పట్టణంలోని రాజవీధిలో జగన్నాథుని దేవస్నాన పూర్ణిమ వైభవంగా జరిగింది. నిజమందిరం నుంచి దేవతామూర్తులు బలభద్ర, జగన్నాథ, సుభద్రలను అడపా మందిరంకు తరలిరాగా.. వందలాది భక్తులు సమర్పించిన కొబ్బరి బొండాలతో జగన్నాథునికి దేవస్నానం ఆచరించారు. ఈ ఘట్టానికి శుభసూచకంగా వర్షం పడటం విశేషం. అర్బన్ బ్యాంకు గ్రౌండ్స్‌లో ప్రసాదసేవనం జరిగింది. సాయంత్రం గజానన అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు.



జయపురంలో పోటెత్తిన భక్తులు

ఘనంగా దేవస్నాన పూర్ణిమ

కొరాపుట్: దేవదేవుళ్లకి స్నానపూర్ణిమ ఘనంగా జరిగింది. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో వేద పండితులు జగన్నాథ, బలబద్ర, సుభద్ర విగ్రహాలను బయటకు తెచ్చి స్నానమాచరించారు. దక్షిణ ఒడిశా జగన్నాథ మందిరంగా పిలవబడ్డ కొరాపుట్ శబరి శ్రీక్షేత్రంలో ఆలయం బయట నిర్వహించారు. ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో శబరి శ్రీక్షేత్రం తరపున అక్కడ దేవాలయంలో స్నాన పూర్ణిమ ఘట్టం ముగిసింది.



జయపురం: స్నాన మండపం వద్ద భక్త జనం



కొరాపుట్ :ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కొఠియాలో స్నాన పూర్ణిమ



కొరాపుట్ :కొట్‌పాడ్‌లో స్నాన పూర్ణిమ ఘట్టం



కొరాపుట్ :నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో వేదపండితుల పూజలు



పర్లాకిమిడి: గజానన అవతారంలో జగన్నాథుడు



కొరాపుట్ :కొరాపుట్ జిల్లా కేంద్రంలో స్నాన పూర్ణిమ



మల్కన్‌గిరి: స్నానానికి సిద్ధంగా ఉన్న దేవతామూర్తులు



పర్లాకిమిడి: జగన్నాథుని అడపామందిరంలో దేవస్నానం



పర్లాకిమిడి: దేవస్నాన పూర్ణిమ తిలకించేందుకు విచ్చేసిన అశేష భక్తజనం



పర్లాకిమిడి: సుభద్రకు దేవస్నానం



మల్కన్‌గిరి: జగన్నాథున్ని దర్శించుకుంటున్న ఓ భక్తుడు

న్యూస్‌రీల్

గణనాథుని అవతారంలో జగన్నాథుడు దర్శనం



గణనాథని అవతారంలో దేవతామూర్తులు

రాయగడ: ఈ నెల 27వతేదీన జరగనున్న రథాయాత్రలో భాగంగా బుధవారం జగన్నాథ, బలభద్ర, శుభద్ర దేవతామూర్తులకు దేవస్నాన కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. దేవతా మూర్తులను మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. దేవస్నానం అనంతరం దేవతామూర్తులైన జగన్నాథ, బలభద్రులకు గణనాథుని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చే సౌభాగ్యాన్ని కల్పించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ఈనెల ఆరో తేదీ నుంచి జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సుప్రభాత సేవ చూర్ణోత్సవం, వసంతోత్సవం, శ్రీవారి అష్టోత్తర శతనామావళి, 108 కలశాలతో జలాభిషేకం, చక్రతీర్థం, శాత్తుముఱై, హోమాల కార్యక్రమాలతో పాటు సాయంత్రం మహాపూర్ణహుతి, గరుడ ధ్వజ అవరోహణం, బలిహరణ, పుష్పాంజలి, శ్రీపుష్పయాగం, నీరాజన మంత్రపుష్పములు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

నదిలో మునిగి వృద్ధురాలు మృతి



లీలా కారామ్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ-79 గ్రామం పోలీసు స్టేషన్ పరిధిలోని గినిపల్లి గ్రామానికి చెందిన రామా కారామ్ తల్లి లీలా కారామ్ (66) మంగళవారం సాయంత్రం శబరి నదిలో స్నానానికి దిగి కాలుజారి పడిపోవడంతో నీట మునిగి ప్రాణాలు కోల్పోయింది. చీకటి పడినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామాలో వెతికితప్పటికీ ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం స్థానికులు నది వద్దకు వెళ్లగా, నీటిలో లీలా కారామ్ శవమై తేలియాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహన్ని బయటకు తీసి కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

గుట్కా తయారీ సామగ్రి స్వాధీనం



వ్యాన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: నిషేధిత గుట్కా తయారీ సామగ్రిని స్థానిక జీఎస్‌టి విభాగం కమిషనర్ నిహారిక జంకార్ స్వాధీనం చేసుకున్నారు. బరంపురం నుంచి కొరాపుట్ వైపు వెళ్తున్న పికప్ వ్యాన్‌ను జేకేపూర్ సమీపంలోని నాగావళి నదీ వద్ద జీఎస్‌టీ అధికారులు ఆపి తనిఖీ చేశారు. అందులో గుట్కా తయారీకి వినియోగించే 30 బస్తాల పనొమాధురి, జర్దా వంటి వస్తువులు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు పది లక్షల రుపాయలు ఉంటుందని జీఎస్‌టీ కమిషనర్ మాధురి అంచనా వేశారు. గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన దాడుల్లో రూ.4.50 కోట్లను జరిమానాల రూపంలో వసూలు చేసినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.91 లక్షల జరిమానా విధించినట్లు సమకూరిందని వివరించారు.

అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సత్బీర్ సింగ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ-9 గ్రామంలో అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది. ఎంవీ-79 గ్రామ క్రీడా మైదానంలో భారత్ జట్టు మాజీ మేనేజర్ సత్బీర్ సింగ్ పోటీలను ప్రారంభించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. తొలిరోజున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోంట, ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ జట్ల మధ్య పోటీ జరిగింది. ముందుగా టాస్ గెలిచిన కోంట జట్టు 112 పరుగులు చేయగా.. 113 పరుగులు చేయాల్సిన భువనేశ్వర్ జట్టు కేవలం 85 పరుగులకే ఆలవుట్ అయింది. దీంతో కోంట జట్టు విజయం సాధించింది. పోటీలకు ఎంవీ-79 గ్రామానికి చెందిన జై శ్రీరామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ కర్యకర్తలు దీపాక్ ధత్, పరితోష్ సర్కార్, శంభు బాగ్చి, సచీన్ సర్కార్, సినీయర్ క్రికెటర్ మానాస్ రంజాన్ అన్న పాల్గొన్నారు.

క్రికెట్ అకాడమీ పేరిట రూ. 35 లక్షలు స్వాహా

- మాజీ క్రీడాకారుడు గౌరవ హత్త ఆరోపణ

జయపురం: జయపురం విక్రమ క్రీడా మైదానంలో క్కికెట్ అకాడమీ పేరుతో రూ 35 లక్షలు జిల్లా క్రీడా సంఘం స్వాహా చేసిందని మాజీ క్రీడాకారుడు గౌరవ హత్త ఆరోపించారు. మంగళవారం సాయంత్రం మీడియ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. సంఘం చట్ట విరుద్ధంగా నిర్వహించబడుతున్నదని, ఏళ్ల తరబడి ఇద్దరు, నలుగురు కబ్జాలో క్రీడా సంఘం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ బైలాన్‌ను అనుసరించి ఎన్నికలు నిర్వహించటం లేదన్నారు. ఉన్నత న్యాయ స్థానం ఆదేశించినా పట్టించుకోవడం లేదన్నారు. క్రీడా అకాడమీ ఏర్పాటు పేరుతో 35 లక్షలు స్వాహా చేశారని ఆరోపించారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ బైలాను పక్కకుపెట్టి, నకిలీ బైలాను అమలు చేస్తున్నారని ఆరోపించారు. గత 35 ఏళ్లుగా సంఘం కొద్ది మంది వ్యక్తుల చేతిల్లోకి వెళ్లిపోయిందని.. అందుకే ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు.



గౌరవ హత్త

2022 అక్టోబర్ ఏడో తేదీన ఆనాటి జిల్లా కలెక్టర్ అబదూల్ అక్తర్ జిల్లా క్రీడా సంఘాన్ని రద్దు చేశారని గుర్తు చేశారు. ఒక జనస్వార్థ కేసులో 2024 డిసెంబర్‌లో ఉన్నత న్యాయ స్థానం నాలుగు వారాలలో సంఘ ఎన్నికలు జరపాలని ఆదేశించిందని చెప్పారు. సంఘం ఎన్నికలు జరుగ కుండానే ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలలో సంఘ ప్రతినిధులుగా ఓటు వేశారని ఆరోపించారు. మీడియ సమావేశంలో సమాజ సేవకుడు కృష్ణ కేశవ షాడంగి పాల్గొన్నారు. కాగా సంఘంపై గౌరవ హత్త చేసిన ఆరోపణలను క్రీడా సంఘ ఉపాధ్యక్షులు అనూప్ కుమార్ పాత్రో, జయపురం సబ్‌డివిజన్ క్రీడా సంఘ కార్యదర్శి రబి నాయిక్‌లు తీవ్రంగా ఖండించారు. గౌరవ వ్యక్తులపై ఆరోపణలు చేస్తూ తనను పరిచయం చేసుకొనేందుకు గౌరవ్ ప్రయత్నం చేస్తున్నారన్నారు.

అంతర్ రాష్ట్ర మహిళల అంధుల క్రికెట్ విజేత ఒడిశా

ఉక్కునగరం: ఉక్కు స్టేడియంలో జరిగిన అంతర్ రాష్ట్ర మహిళల బ్లైండ్ క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్ (సీఏబీఏపీ), క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ కేరళ (సీఏబీకే) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్‌లో ఢిల్లీ, ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో ఒడిశా జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగింది. 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు 15 ఓవర్లలో 80 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఒడిశా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌కు డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎన్టీపీసీ ఈడీ సమీర్ శర్మ, హెచ్ఆర్ బి.బి.శర్మ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డి, కో-ఆర్డినేటర్లు అమ్మి నాయుడు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమందిరంపై డ్రోన్

భువనేశ్వర్: పూరీ జగన్నాథ దేవస్థానం శ్రీ మందిరం శిఖరాన డ్రోన్ చక్కర్లు కొట్టింది. స్నానోత్సవం పురస్కరించుకుని భారీ బందోబస్తుతో పోలీసులు, అధికార యంత్రాంగం ఆలయం పరిసరాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయగా నిషేధిత ప్రాంతంలో డ్రోన్ చక్కర్లు కొట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

పోలీసులకు చిక్కిన మత్తు ఇంజక్షన్ల విక్రేతలు

- ఐదుగురు అరెస్టు
- 513 పెంటాజొకెన్ ఇంజక్షన్ స్వాధీనం

జయపురం: జయపురంలో మత్తు ఇంజక్షన్లు, మత్తు పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పరిస్థితిలో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. మే నెల ఐదో తేదీన మత్తు ఇంజక్షన్ స్వాధీనంతో పాటు దీనితో సంబంధం ఉన్న ముగ్గురిని అరెస్టు చేసిన పట్టణ పోలీసులు మరోసారి చర్యలకు ఉపక్రమించారు. తాజాగా ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 513 పెంటాజొకెన్ ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నామని పట్టణ పోలీసు అధికారి ఉల్లాష్ చంద్ర రౌత్ బుధవారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో స్థానిక ఆదర్శనగర్‌కు చెందిన రాకేష్ పటొన్నాక్, డొంగాగుడ వాసి రామ హరిజన్, సునాబెడకు చెందిన అభినవ ప్రధాన్, సెమిలిగుడ మెనార్ కేంప్ రోడ్‌లో నివసిస్తున్న త్రినాథ్ కొరబు, ధమంజొడి బెజాపుట్ సత్‌సంఘ్ కాలనీ వాసి సంజయ జెన ఉన్నారన్నారు. అరెస్టు అయిన నిందితుల నుంచి 513 పెంటాజొకెన్ ఇంజక్షన్ ఆంపిల్స్‌తో పాటు ఒక కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్టు పోలీసు అధికారి ఉల్లాష్ చంద్రరౌత్ వెల్లడించారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం.. ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి ఎస్సై గోవింద చందహంసద్, ఏఎస్సై దేవీ ప్రసాద్ పండల నేతృత్వంలో పోలీసులు పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో కొలాబ్ ప్రధాన కెనాల్ గాంధీ చౌక్, హెక్టాగుడ మార్గంలోని ఓ హోటల్ వద్దకు పోలీసులు చేరారు. ఆ సమయంలో ఒక కారు రోడ్డు పక్కన నిలిచి ఉంది. కారు వద్ద ఉన్న ఆరుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరారవుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించి ఐదుగురిని పట్టుకున్నారు. మరో వ్యక్తి పరారైనట్టు పోలీసులు చెప్పారు. కారుని తనిఖీ చేయగా డిక్కీలో ప్యాకెట్లలో ఉన్న మత్తుమందు ఇంజక్షన్లు బయట పడ్డాయన్నారు. మెజిస్ట్రేట్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సమక్షంలో ఇంజక్షన్లను లెక్కించటం జరిగిందని వివరించారు. సెడ్యూల్- హెచ్ కేటగిరీకి చెందిన ఆ ఇంజక్షన్లను డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ సంఘటనపై ఎన్‌డీపీఎస్, డ్రగ్స్, కాస్మెటిక్స్ 1940 చట్టం పరిధిలో కేసులు పెట్టినట్టు చెప్పారు. మత్తు ఇంజక్షన్లను యువతను దృష్టిలో పెట్టుకొని వాటిని తెప్పించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.



మత్తు ఇంజక్షన్లతో పట్టుబడిన నిందితులు



సీజ్ చేసిన పెంటాజొకెన్ ఇంజక్షన్లు

క్లుప్తంగా

గణపతి స్వరూపుడిగా జగన్నాథుడు


జగన్నాథుడు

భువనేశ్వర్: స్నాన యాత్ర కోసం విచ్చేసిన భక్తులు, యాత్రికులకు జగన్నాథుడు మహా గణపతి స్వరూపంలో దర్శన భాగ్యం కల్పించాడు. ఏటా జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా మహా స్నానం అనంతరం నిత్యం శ్రీ మందిరం రత్న వేదికపై దర్శనం ఇచ్చే మూల విరాటులు గజానన అలంకరణలో శోభిల్లుతారు. స్థానిక రాఘవ దాసు మఠం క్రమంతప్పకుండా గజానన అలంకరణ సామగ్రి, సరంజామా ఏర్పాటు చేస్తుంది. స్నానోత్సవంలో ఈ దర్శనం అంతిమ ఘట్టం.

ఐటీడీఏ సమావేశంలో ఆగ్రహావేశాలు


ఐటీడీఏ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: జిల్లాలో ఆశ్రమ పాఠశాలల పనితీరుపై బుధవారం నిర్వహించిన ఐటీడీఏ సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని డీఎన్‌కే సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాల్లో సమస్యలు తిష్ఠ వేశాయని, అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకపోతుందన్నారు. సీఎల్‌పీ నాయకుడు రాంచంద్ర ఖడం మాట్లాడుతూ కోట్లాది రూపాయలు ఖర్చులు చేస్తున్నా గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తివాసన్, ఎమ్మెల్యే రఘురాం మచ్చో తదితరులు పాల్గొన్నారు.

బొరిగుమ్మ విద్యార్థినికి 11వ ర్యాంక్


కె.వినీత

జయపురం: + 2 కామర్స్ 2025 పరీక్షలో బొరిగుమ్మ రోయల్ హయ్యర్ సెకెండరీ స్కూల్ విద్యార్థిని కె.వినీత రాష్ట్ర టాపర్‌లలో 11వ స్థానం సాధించింది. విద్యార్థిని 93.33 శాతం మార్కులు సాధించింది. రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంక్‌గా నిలిచినందుకు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, బంధువు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

పిడుగుపాటుకు మూడు పశువులు మృతి


మృతి చెందిన పశువుల వద్ద బాధితుడు జగరావు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీ తొలొసాజ్జ గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మూడు పశువులు మృతి చెందాయి. ఇవి గ్రామంలోని పాయికొ మినియాక, జగరావు మినియాకలకు చెందినవిగా గుర్తించారు. మేత మేస్తుండగా పిడుగు పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువకుడు ఆత్మహత్య


అజిత్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితిలో బుధవారం అజిత్ ముజుందర్ అనే యువకుడు తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు రోజులుగా తలుపులు తీయకపోవడంతో దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తలుపులు తెరవగా అజిత్ ఓ గదిలో చీరతో ఉరివేసుకుని విగత జీవిగా కనిపించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

భక్తుల సేవలో..!


భక్తులను దర్శనం కోసం తీసుకుని వెళ్తున్న కార్యకర్తలు

పవిత్ర దేవస్నాన పూర్ణిమ సందర్భంగా పూరీ జగన్నాథ మందిరం వద్ద స్నాన మండపంపై చతుర్ధా మూర్తుల దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూరీ పోలీసులు బొడొ దండొ సాథీ వలంటీర్లను నియమించారు. శ్రద్ధ, గౌరవం, భక్తి భావంతో వీరు సేవలు అందించి అందరి మన్ననలు పొందారు. ఓ వృద్ధురాలు వడదెబ్బ లక్షణాలతో స్వల్ప అస్వస్థతకు గురైనట్లు గుర్తించిన బొడొ దండొ సాథీ కార్యకర్తలు తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స చేసి ఆమె కోలుకునేలా చేశారు. అనంతరం దర్శనం కల్పించారు. – భువనేశ్వర్


వృద్ధురాలికి సాయం చేస్తున్న సహాయకులు


దివ్యాంగునికి బొడొ దండొ సాథీ చేయూత


అవ్వను నడిపిస్తున్న బొడొ దండొ సాథీ వలంటీర్లు


అస్వస్థతకు గురైన వృద్ధ భక్తురాలికి ప్రాథమిక చికిత్స అందించిన సేవకులు

ముగిసిన బురదల పోలమ్మ ఉత్సవాలు


గ్రామదేవత బురదల పోలమ్మ

రాయగడ: స్థానిక భైరవీధిలో వెలసిన బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో ఆఖరి రోజున అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను మందిరం వద్దకు తీసుకువెళ్లడంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు విరాళాల రూపంగా సమర్పించిన వెండితో అమ్మవారికి మకర తోరణం తయారు చేయించారు.


ముగింపు ఉత్సవాల్లో భక్తుల సందడి

హారతి దర్శనం మోక్షదాయకం


బలభద్ర స్వామికి మంగళ హారతి


దేవీ సుభద్రకు మంగళ హారతి

భువనేశ్వర్: జగతి నాథుని దర్శనం అడుగడుగున మోక్షదాయకం. మంగళ హారతి నిత్య సేవల్లో భాగం. భక్తులకు ఈ దర్శనం లభించడం అరుదు. స్నాన యాత్ర పురస్కరించుకుని తరలివచ్చే భక్తులు, యాత్రికులకు అరుదైన మంగళ హారతి నిరాటంకంగా ప్రాప్తిస్తుంది. స్నాన మండపంపై ఆసీనులైన చతుర్ధా మూర్తులకు మంగళ హారతి సేవ భక్తుల సమక్షంలో జరగడంతో ఈ భాగ్యం కలిసి వస్తుంది. లోక కల్యాణం కోసం స్వామికి పలు సేవలు నిర్వహిస్తారు. స్నాన మండపంపై మంగళ హారతి దర్శనం శత్రు వృద్ధి వినాశనం చేస్తుందని ప్రధానంగా విశ్వసిస్తారు.


స్నాన మండపంపై భక్తులకు మంగళ హారతి దర్శనం ప్రసాదించిన జగన్నాథుడు

ఘనంగా అష్టోత్తర కలశ మహాభిషేకం


బలభద్ర స్వామికి జలాభిషేకం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని మహాభిషేకం అంగరంగ వైభవంగా ముగిసింది. అశేష భక్త జనం మధ్య మూల విరాటులు సుగంధిత జలంతో మహా స్నానం ఆచరించారు. శ్రీ మందిరం సముదాయం ఉత్తర దిశలోని బంగారు బావి నుంచి తోడిన నీటిలో సుగంధిత పుష్ప, చందనాదులు ఇతరేతర సుగంధ ద్రవ్యాల్ని జోడించి బలభద్రుడు, దేవీ సుభద్ర, జగన్నాథుడు, సుదర్శనునికి జలాభిషేకం నిర్వహించారు. అష్టోత్తర కలశాలతో ఈ అభిషేకం నిర్వహించడం విశేషం. జగన్నాథుడు అత్యధికంగా 35 కలశాల జలంతో స్నానం ఆచరించగా 33 కలశాలతో బలభద్ర స్వామి, 22 కలశాలతో దేవీ సుభద్ర, 18 కలశాలతో సుదర్శన భగవానునికి సుగంధిత జలంతో స్నాన మండపంపై అభిషేకించారు.

• 14 నుంచి వికాస్ మేళా

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జిల్లా స్థాయిలో వికాస్ మేళా, సుభద్రశక్తి పారంపర వంటల పోటీలు, మామిడి పండ్ల ప్రదర్శన వంటి 77 స్టాల్స్ మేగా అభివృద్ధి మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ బుధవారం మీడియా సమావేశంలో తెలియజేశారు. జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధిశాఖ అధికారి అంశుమాన్ మహాపాత్రో, ఓర్మాస్ డిప్యూటీ సీఈఓ సుభాల్ జనమని, డీపీఆర్‌ఓ ప్రదిప్త గురుమయి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో బీజేపీ సర్కారు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వికాస్ మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. ఈ మేళాలో జిల్లాలో అమలు జరుగుతున్న అనేక ప్రభుత్వ పథకాలు, స్టాల్స్ ద్వారా తెలియజేస్తామన్నారు. దీంతోపాటు గజపతి జిల్లాలో 199 గ్రామ పంచాయతీల వికాస్ వాహన యాత్ర జరుపుతామన్నారు. ఈ మేళాలో ప్రజలకు ఉచిత ఆధార్ కార్డు సేవలు, రెవెన్యూ పట్టాల పంపిణీ, కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీ, ప్రధాన మంత్రి సూర్యజ్యోతి ఘర్ పథకం దరఖాస్తుదారుల ఆమోదం, పీఎం జనమనయోజనా, లేబర్‌కు జాబ్ కార్డులు, రేషన్ కార్డులు ప్రదానం, ఉజ్వల్ కృషి విభాగం ద్వారా ముఖ్యమంత్రి కిసాన్ యోజన పథకాలు అందిస్తామని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు.



మాట్లాడుతున్న పాలనాధికారి బిజయ కుమార్ దాస్

స్నానోత్సవం.. పులకించిన భక్తజనం


భువనేశ్వర్: పూరీ జగన్నాథ దేవస్థానంలో స్నాన పూర్ణిమ పురస్కరించుకుని నిర్వహించే స్నానోత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. సోదర సోదరి సమేతంగా జగన్నాథుడు స్నాన మండపంపై బహిరంగంగా భక్తజనం సమక్షంలో మహాభిషేకం ఆచరించడం ఈ ఉత్సవం విశిష్టత. ఈ వేడుక ప్రత్యక్షంగా తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచి మంగళహారతి మొదలుకొని ఒకొకాసా, బింబ స్నానం వంటి దైనందిన ఆచారాల తరువాత రత్న వేదిక నుంచి మూల విరాటులను వరుస క్రమంలో (గొట్టి పాహాండి) స్నాన మండపానికి తరలించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధమైన వాద్యనాదంతో శ్రీ మందిరం పరిసరాలు మారుమోగాయి. చందనం, కర్పూరం, కుంకుమ, మూలిక తైలాలు, సహజ పరిమళ ద్రవ్యాలతో ఇతరేతర సుగంధ పుష్పాది ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలంతో నిండిన 108 కలశాల జలంతో చతుర్ధా మూర్తులకు అభిషేకించారు. మూల విరాటుల పవిత్ర స్నానం పూర్తి కావడంతో పూరీ గజపతి మహారాజా దివ్యసింఘ దేబ్ పల్లకీలో స్నాన మండపానికి చేరి స్నాన మండపం శుద్ధి ఛెరా పొంహరా ఆచారాన్ని నిర్వహించారు. మూల విరాటులకు మంగళ హారతులు సమర్పించి పూజించారు.


సుగంధ పుష్ప సోయగంతో జగన్నాథుడు


స్నాన మండపం నుంచి భక్తులకు అభివాదం చేస్తున్న పూరీ గజపతి మహా రాజా దివ్య సింఘ్ దేవ్


స్వామి సేవకు తరలివస్తున్న పూరీ గజపతి మహారాజా


స్నాన మండపానికి వేంచేస్తున్న బలభద్ర స్వామి


ఉత్సవ శోభతో శ్రీ మందిరం సింహద్వారం ప్రాంగణం

పూరీలో సేవాయత్ హత్య

భువనేశ్వర్: పవిత్ర స్నానోత్సవం భారీ స్థాయిలో జరుగుతుండగా పూరీ పట్టణంలో సీనియర్ సేవాయత్ దారుణ హత్య సంఘటన తీవ్ర కలకలం రేపింది. స్థానిక గుడియా సాహిలో జరిగిన ఈ ఘటనలో మృతుడు మహి ప్రకాష్ మఠానికి చెందిన 84 ఏళ్ల జగన్నాథ్ దీక్షిత్‌గా గుర్తించారు. ప్రాథమిక విచారణ ఆధారంగా నారాయణ్ పట్టజోషిని ప్రధాన నిందితునిగా గుర్తించి స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. పాత కక్షలు కారణంగా ఈ హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. శ్రీ జగన్నాథుని స్నానోత్సంలో తన వంతు పొంతిబొడు సేవ ముగించి తిరిగి వస్తుండగా జగన్నాథ్ దీక్షిత్ హత్యకు గురయ్యాడు. జగన్నాథ్‌ను తన ఇంటికి రమ్మని పిలిచి దారిలో రబేణి చౌరస్తా సమీపంలో నారాయణ్ పట్టజోషి హత్య చేశాడు. ఘటనా స్థలంలో మృతదేహాన్ని విడిచి పెట్టి నిందితుడు సైకిల్‌పై పారిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరి దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని అరెస్టు చేశారు.

నేటి నుంచి అలార్‌నాథ్ ఆలయ దర్శనం

• భద్రత కట్టుదిట్టం

భువనేశ్వర్: పవిత్ర స్నాన యాత్ర ప్రభావంతో జగన్నాథునితో సహా తోబుట్టువులు బలభద్ర స్వామి, దేవీ సుభద్ర జ్వరం బారిన పడ్డారు. స్నాన మండపం నుంచి మూల విరాట్‌లకు బుధవారం రాత్రి అనవసర మండపాని తరలించారు. శ్రీమందిరం రత్న వేదిక బోసిబోయింది. ఈ ప్రాంగణంలో భక్తులకు నిత్య దర్శనం తాత్కాలికంగా ముగిసింది. ఈ సందర్భంగా పూరీ నుంచి స్వల్ప దూరంలో బ్రహ్మగిరి ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న అలార్‌నాథ్ స్వామిని భక్తులు దర్శించుకుంటారు. గురువారం నుంచి ఈ దేవస్థానం భక్తులు, యాత్రికుల తాకిడితో కిటకిటలాడుతుంది.

విస్తృత ఏర్పాట్లు..

ఈ సందర్భంగా స్థానిక యంత్రాంగం అలార్‌నాథ్ ఆలయం ప్రాంగణంలో విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు భారీ భద్రత ఏర్పాటు చేసింది. అదనపు పోలీసు సూపరింటెండెంట్, నలుగురు డీఎస్పీలు, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందితో సహా సీనియర్ అధికారులతోపాటు మొత్తం 7 ప్లాటూన్ల పోలీసులతో ఒక సెక్షన్ సాధారణ దుస్తుల పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. సులభ దర్శనం కోసం ఆలయం వద్ద ముందస్తుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిత్యం సర్వ దర్శనం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతుంది. ఈ నెల 26 వరకు అలార్‌నాథ్ స్వామి దర్శనం కోసం భక్తులు తరలివస్తారు. భారీ స్నానం ఆచరించడంతో అనారోగ్యానికి గురైన మూల విరాట్‌లు కోలుకునేందుకు పక్షం (15) రోజులు పడుతుంది. అంత వరకు ప్రధాన దేవ స్థానంలో మూల విరాట్‌ల దర్శనం ప్రాప్తించదు. ఈ నిడివిలో బ్రహ్మగిరిలో కొలువు దీరిని అలార్ నాథ్ స్వామిని దర్శించుకుంటే జగన్నాథుని దర్శించుకున్న మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం.


బ్రహ్మగిరిలో కొలువు దీరిన అలారనాథ్ స్వామి

ఉత్సాహంగా పిండివంటల పోటీలు


ద్వాక్రా మహిళా గ్రూపులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

పర్లాకిమిడి: పట్టణంలోని బిజూ కల్యాణ మండపంలో బుధవారం జిల్లా స్థాయి సుభద్ర శక్తి పండివంటల పోటీలను మిషన్ శక్తి డి.పి.ఎం. టిమోన్ బోరా ఆధ్వర్యంలో నిర్వహించారు. సబ్‌కలెక్టర్ అనుప్ పండా, జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి మనోరమా దేవి తదితరులు హాజరై వంటకాలను పరిశీలించారు. ఉపాధి రాగులు, కొర్రలు, ఇతర పిండి వంటలు విక్రయం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన సాధించాలని సబ్‌కలెక్టర్ ఆకాంక్షించారు. ఏడు సమితిల నుంచి 26 ద్వాక్రా మహిళా గ్రూపుల మహిళలు హాజరై పాయసం, కోంకడాల పులుసు, బూరెలు, గారెలు తదితర వంటకాలు చేశారు. గుమ్మా బ్లాక్ ఝామి గ్రామానికి చెందిన అంజనా శక్తిదళ్, మోహనా, పర్లాకిమిడి గ్రూపులు తొలి మూడు స్థానాల్లో నిలిచాయని డీపీఎం తెలిపారు. విజేతలకు ఈ నెల 14న గజపతి స్టేడియంలో జరిగే మెగా వంటలు, పండ్ల ప్రదర్శనలో మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ సమక్షంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.


కొంకడాల పులుసు


వేడి వేడి బోరాలు


వంటల పోటీలో మహిళలు


నోరూరించే వడలు, రొయ్యిల కూర

క్లుప్తంగా

16 నుంచి కబడ్డీ టీమ్‌కు శిక్షణ



శిక్షణ వివరాలు వెల్లడిస్తున్న కొండలరావు

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా అండర్ 18న కబడ్డీ టీమ్‌కు శిక్షణ ఈ నెల 16 నుంచి ప్రారంభిస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కబడ్డీ అసోసియేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అండర్ 18 కబడ్డీ టీమ్ జాతీయస్థాయిలో పాల్గొనడానికి క్రీడాకారులకు శిక్షణ అందిస్తామన్నారు. ఈ నెల 28 నుంచి హరిద్వార్‌లో జరగనున్న జాతీయస్థాయి అండ్ 18 కబడ్డీ పోటీల్లో పాల్గొనదలచిన వారికి శిక్షణ అందిస్తామని, వారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ 9440529144 నంబర్‌ను సంప్రందించాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోడి సుదర్శనరావు, కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్, కోశాధికారి శనగల సీతారాం, సభ్యులు కాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన ప్రింటర్ తదితర సామగ్రి

వేపాడ: మండలంలోని భర్తవానిపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో దుకాణంలోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై బాధితుడు పోతల రామునాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారు జామున తన షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో ప్రింటర్‌తో పాటు నోట్‌బుక్స్, ఇతక సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ మీటర్ కాలిపోయిందని, ఫ్రిడ్జ్ పాక్షికంగా కాలిపోయిందని, సుమారు ఏభై వేలు రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఆమె చూపు పదిలం



జగదాంబ (ఫైల్)

చీపురుపల్లి: మరణానంతరం చూపు పదిలంగా ఉండాలంటే నేత్రదానం చేయాలి. అప్పుడే ఆ నేత్రాలు నిరంతరం సజీవంగా ఉంటాయి. అందులో భాగంగానే చీపురుపల్లి పట్టణానికి చెందిన అంధవరపు జగదాంబ చూపు కూడా నిరంతరం పదిలంగా ఉండనుంది. దీనికి ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేయడమే కారణం. పట్టణంలోని ఆంజనేయపురంలో నివాసం ఉంటున్న అంధవరపు జగదాంబ (57) బుధవారం ఉదయం మృతిచెందారు. దీంతో పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు అక్కడికి వెళ్లి నేత్రదానంపై కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో మృతురాలి భర్త అంధవరపు నర్సింగరావు తన భార్య నేత్రాలు దానం చేసేందుకు అంగీకరించగా విజయనగరం రెడ్ క్రాస్ సొసైటీ టెక్నీషియన్ రమణ, సుధాకర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి నుంచి కార్నియా సేకరించారు.

సీతం అధ్యాపకుడికి గుర్తింపు

- ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ



అధ్యాపకుడు మధుబాబును అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు, అధ్యాపకులు

విజయనగరం అర్బన్: ఐఐటీ మద్రాస్ నిర్వహించిన నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీస్ ఎన్‌హేన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) జాతీయస్థాయి ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ చూపిందుకు విజయనగరం పట్టణంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు మొగలి మధుబాబుకు 'ఎన్‌పీఈఎల్ స్టార్ బిలీవర్'గా గుర్తింపు లభించింది. ఈ మేరకు బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన నాలుగు విభిన్న సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించారు. జూలైలో ఐఐటీ మద్రాస్‌లో జరగనున్న ప్రత్యేక 'స్టార్ బిలీవర్స్' వర్క్‌షాప్‌కు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుబాబును కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డార్టర్ దామోదరనాయుడు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

వసివాడుతున్న బాల్యం!

అభంశుభం తెలియని చిన్నారులు ఆడుతూ పాడుతూ గంతులేయాల్సిన వయసులో కుటుంబ బాధ్యతలు మోస్తున్నారు. బడికి పోవాల్సిన బాలలు బండెడు చాకిరీలో మగ్గిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా బడి ముఖం చూడని బాలలు 20 కోట్ల పైనే అని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇంకా లెక్కల్లోకి రాని వారెందరో..మన దేశంలోనే ప్రతి ముగ్గురిలో ఒకరు బడి ముఖం చూడని వారున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు పిలలను పనిలో పెట్టేలా ప్రోత్సహిస్తుండడంతో..వ్యాపార వర్గాల వారు కూడా తక్కువ వేతనంతో ఎక్కువ పనిని బాలలతో చేయిస్తున్నారు. కొందరు బాలలైతే ప్రమదకర పరిస్థితుల్లో కూడా పనులు చేస్తూ బాల్యాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. నేడు ప్రపంచ బాల కార్మిక నిర్మూలన దినం సందర్భంగా..



పని ప్రదేశంలో బాలలు

- పనుల్లో నలిగిపోతున్న పిల్లలు
- నేడు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం

విజయనగరం గంటస్తంభం: చిన్న వయస్సులోనే పనులు చేస్తున్న బాల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు కనీసం ప్రాథమిక విద్య కూడా పొందకుండానే కార్మికులుగా మారుతున్నారు. వారిలో పోషకార లోపం కారణంగా శారీరక ఎదుగుదల సరిగ్గా ఉండడం లేదు. అనేక మానసిక, శారీరక ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. యాజమాన్యాలు బాల కార్మికులతో ఎక్కువ పనిచేయిస్తూ, తక్కువ వేతనాలు ఇస్తున్నాయి. కొంతమంది బాలలు వారి సామర్థ్యానికి మించి పనులు చేయాల్సి వస్తోంది. ప్రమాణాలకు అనుగుణంగా లేని ప్రమాదకర పరిస్థితుల్లో సైతం బాలలు పనిచేస్తున్నారు. బాలకార్మికులు భౌతిక, లైంగిక దాడులను ఎదుర్కోవాల్సి వస్తోందని అనేక నివేదికలు వివరిస్తున్నాయి.

భవిష్యత్ అంధకారం..

బాల కార్మికులుగా కొనసాగిన వారు భవిష్యత్‌లో ఉన్నతమైన జీవితాన్ని గడిపేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయి. వారికి సరైన విద్య లేకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. పోటీతత్వం నిండిన సమాజంలో అన్నిరకాలుగా వెనుకబడిపోతున్నారు. పెద్దవారయ్యాక సరైన ఉపాధి దొరకని కారణంగా పలువురు నేరాలకు పాల్పడుతున్నారు.



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం అనుబంధ చిత్రం

ఏటా బాలకార్మిక వ్యతిరేక దినం

ఏటా జూన్ 12న దాదాపు 100 దేశాల్లో బాల కార్మికుల వ్యతిరేక దినం నిర్వహిస్తారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా అవగాహన తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుకత ఆధ్వర్యంలో ఈ దినాన్ని నిర్వహిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పిల్లలు ఏదో ఒక పనిలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాలు, పట్టణల్లో పనులు ఎక్కువగా లభిస్తున్నందున చిన్నారుల వలసలు కొనసాగుతున్నాయి. అలా మారడానికి కారణం అధిక జనాభా, నిరక్షరాస్యత, పేదరికం వంటి కారణాలతో బడి ఈడు పిల్లలు చదువుకు దూరమవుతున్నారు.

బాలలను పనిలో పెడితే... కఠిన చర్యలు



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాధ్యత అందరిపై ఉంది. చిన్నారులను పనిలో పెట్టినా, వారితో పనులు చేయించినా చట్టారీత్యా నేరం. బాల కార్మికులు ఎక్కడ కనిపించినా 1098, 100, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నాం. విజయనగరం జిల్లాలో అన్ని శాఖల వారీగా 2020–24 సంవత్సరాల మధ్య మొత్తం 576 పిల్లలను రక్షించాం. ఈ ఏడాది జూన్ 1తేదీ నుంచి ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ స్పెషల్ డ్రైవ్ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ఎక్కువగా ఉండే మార్కెట్లు, కూడళ్లు, ఇటుక బట్టీలు, మెకానిక్ షెడ్లు, వస్త్ర దుకాణాలు తదితర ప్రాంతాల్లో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతి బుధవారం బాలకార్మికుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఈనెల 31 వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుంది. చిన్నారులను పనులకు పంపిస్తే జరిగే అనర్థాలు, చట్టాలపై గ్రామాల్లోనూ అవగాహన కల్పిస్తున్నాం.

ఎస్‌డీవీ ప్రసాదరావు,
జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్

అడ్డగోలు అవిశ్వాసం సంపూర్ణం



అవిశ్వాస తీర్మాన సమావేశంలో చేతులెత్తుతున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

బొబ్బిలి: టీడీపీ నాయకులు పదవీ కాంక్షతో చేపట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి పజలు కట్టబెట్టిన మున్సిపల్ చైర్మన్ పదవిని కౌన్సిలర్లను ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకున్న టీడీపీ నాయకులు వైస్‌చైర్మన్ పదవిని కూడా అదే అవిశ్వాసంతో రాజకీయం చేసి తమ వైపు తిప్పుకున్నారు. దీంతో అడ్డగోలు అవిశ్వాసం పూర్తయినట్లయింది. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామమోహన రావు ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో అవిశ్వాసం తీర్మాన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ముందుగా కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారని, ఇందుకు అనుకూలంగా చేతులెత్తాలని ఆర్డీఓ రామమోహన రావు కోరారు. దీంతో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే బేబీ నాయన చేతులెత్తడంతో మూడవ వంతు కౌన్సిలర్లు (22మంది) చేతులెత్తారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన రెండో వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ కూడా చేతులెత్తడంతో సంఖ్యాపరంగా సరిపోవడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ఆర్డీఓ ధ్రువీకరించారు. అనంతరం వారితో సంతకాలు చేయించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. కాగా ఈ అవిశ్వాస తీర్మానానికి వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాలేదు. వారంతా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోనే ఉండిపోయారు.

మెట్టవలసలో డీఎంఓ పర్యటన

సాక్షి ఎఫెక్ట్



మృతిచెందిన గిరిజన విద్యార్థిని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డీఎంవో వై.మణి

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ పరిధి మెట్టవలస గిరిజన గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థికి కుడుమూరు మేఘన (14) ఈనెల 9వ తేదీ రాత్రి విషజ్వరంతో మృతిచెందిన సంఘటన తెలిసిందే. అయితే ఈ విషయాన్ని విషజ్వరంతో గిరిజన విద్యార్థిని మృతి శీర్షికన ఈ నెల 11న సాక్షి వార్త ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన డీఎండ్‌హెచ్‌వో మెట్టవలస గ్రామాన్ని సందర్శించి మేఘన మృతికి గల కారణాలతో పాటు అక్కడ వైద్యశిబిరం నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణిని ఆదేశించారు. దీంతో ఆమె బుధవారం మెట్టవలస గిరి జన గ్రామాన్ని సందర్శించి మృతిచెందిన గిరిజన విద్యార్థిని తల్లిదండ్రులు సూర్యనారాయణ,సంధ్యలను పరామర్శించారు.అలాగే మేఘన ఎలా మృతిచెందింది? మృతికి గల కారణాలేంటి? ఎన్ని రోజులు జ్వరం వచ్చింది? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మృతురాలి కుటుంబసభ్యులతో పాటు వారి ఇంటి చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో ఒకరిద్దరికి వైరల్ జ్వరాలు ఉండడంతో వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు.సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ఎస్సైకి ఎస్పీ ప్రశంసలు



ఆంధ్ర ఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ఆంధ్ర పోలీస్ స్టేషన్ పరిధి బీరసాడవలన గ్రామసమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరి ప్రాణాలను ఆంధ్ర ఎస్సై కె.సీతారామ్ కాపాడారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. అనంతరగిరి మండలం రొంపల్లి పంచాయతీ గూడెంకు చెందిన గెమ్మెల రాంబాబు, గెమ్మెల అప్పలస్వామిలు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే వారు డయల్ 100, 112 నంబర్‌కు సమాచారం ఇవ్వగా సకాలంలో ఎస్సై సీతారాం స్పందించి ఘటనా స్థలికి చేరుకుని, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరిని 108 సిబ్బంది సహకారంతో అంబులెన్స్‌లో ముందుగా గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆ ఇద్దరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం గాయపడిన ఇద్దరు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనను స్పెషల్ బ్రాంచ్ ద్వారా తెలుసుకున్న ఎస్పీ వకుల్ జిందల్ ఆంధ్ర ఎస్సై సీతారాంను అభినందించారు.

రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో 11 రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన వర్చువల్ విధానంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీ సమావేశంలో కురుపాం మండలంలోని సందిగూడ నుంచి కాగుమాను గూడ వరకు 820 మీటర్ల రహదారి నిర్మాణానికి, కాగుమానుగూడ నుంచి సాలిదంగు వరకు 820 మీటర్ల రహదారి, పొద్దీస నుంచి సొలమానుగూడ వరకు 1320 మీటర్ల రహదారి, సొలమాను గూడ నుంచి చాపరాయిగూడ వరకు 1300 మీటర్ల రహదారి, దాముగూడ నుంచి చినబంటుజోల వరకు 815 మీటర్లు, మంటికొండ నుంచి దాముగూడ వరకు 733 మీటర్లు, జె పులుపుట్టి నుంచి వై పులిపుట్టి వరకు 1140 మీటర్లు, జాజరుగూడ నుంచి జె పులుపుట్టి వరకు 1120 మీటర్లు, తిత్తిరి నుంచి దొమ్మిడి వరకు 1208 మీటర్లు, దొమ్మిడి నుంచి గాలిమానుగూడ వరకు 1034 మీటర్లు, తిత్తిరి నుంచి గునుగూడ వరకు 1197 మీటర్ల రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ఈ రహదారులు గిరిజన ఆవాసాలను బయట ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు అత్యావశ్యమని కమిటీ భావించింది. త్వరగా రహదారుల నిర్మాణం పూర్తిచేసి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి జీపీపీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గజపతినగరం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి సుమారు 50ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడడం కానీ, రైలు ఢీకొట్టడంతో కానీ జరిగిన ప్రమాదంలో తల, మొండెం వేరువేరుగా పడి ఉన్నాయన్నారు. మృతుడి శరీరంపై బ్లూకలర్ జీన్ ఫ్యాంట్, వైట్ కలర్ షర్ట్, షర్ట్ కాలర్‌పైన శ్రీశక్తిసాయ్ కాటన్ షర్ట్స్ 44అని ఆంగ్ల అక్షరాలు ఉన్నట్లు చెప్పారు. గుర్తు పట్టగలిగిన వారు వెంటనే విజయనగరం జీఆర్పీ ఎస్సై వి.బాలాజీరావు ఫోన్ 9490617089, నంబర్‌కు లేదా హెచ్‌సీ నంబర్ 8309901038,9491813163లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

అండర్–14 క్రికెట్ పోటీల్లో 'విఘ్నేష్' సత్తా

- దూసుకుపోతున్న తెర్లాం యువకుడు
- ముంబైలో జరుగుతున్న టోర్నమెంట్
- టోర్నమెంట్‌లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ
- రెండు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కైవసం



సెంచరీ చేసి అభివాదం చేస్తున్న విఘ్నేష్



మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకుంటున్న విఘ్నేష్

తెర్లాం: ముంబైలో జరుగుతున్న అండర్–14 క్రికెట్ టోర్నమెంట్‌లో తెర్లాం మండలం ఎన్.బూర్జవలస గ్రామానికి చెందిన యువకుడు పైల విఘ్నేష్ రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ చేసి సత్తా చాటాడు. టోర్నమెంట్‌లో ఓ జట్టు తరుపున విఘ్నష్ పాల్గొన్నాడు. ఈ పోటీల్లో రెండుసార్లు మేన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా ఎంపికయ్యాడు. ఒక మ్యాచ్‌లో 91 బంతుల్లో 104 పరుగులు, మరో మ్యాచ్‌లో 62 బంతుల్లో 114 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ముంబైలో పలు రాష్ట్రాలకు చెందిన క్రికెట్ అకాడమీలు నిర్వహించే టోర్నమెంట్‌లో విఘ్నేష్ ఈ ఘనతను సాధించాడు. అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న విఘ్నేష్‌ను మండలానికి చెందిన పలువురు అభినందించారు. విఘ్నేష్ తండ్రి పైల గణపతి ఎన్.బూర్జవలస పంచాయతీ సర్పంచ్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులలో ఆందోళన తొలగించాలి

- నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిమాండ్



కలెక్టరేట్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఉన్న పార్వతీపురం, పాలకొండ, సాలూరు ఆర్టీసీ డిపోల సమస్యలపై ఏపీపీటీడీ, డీపీటీఓలకు అనేక మార్లు మెమొరాండాల ద్వారా సమస్యల పరిష్కారానికి తెలియజేసినప్పటికీ ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదు. పైగా మరిన్ని సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆందోళన, అభద్రత తొలగించి జిల్లాలో పారిశ్రామిక శాంతి నెలకొల్పాలి. ఈ మేరకు బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను, గతంలో యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అంగీకరించారు. అయినప్పటికీ అమలు చేయని అంశాలపై జోనల్ కౌన్సిల్‌లో సుదీర్ఘ చర్చ జరిపి సామరస్య పూర్వకంగా చేసే ఉద్యమాలకు యాజమాన్యం కనీసం స్పందించడం లేదు. ఈ పరిస్థితుల్లో 'సమ్మె నోటీసు' ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామని ఈ నెల 25 తరువాత ఎప్పుడైనా జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు సమ్మెకు సిద్ధం అవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ చొరవ తీసుకుని సిబ్బంది సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆర్టీసీ జిల్లా, డిపో అధికారులను ఆదేశించి సమ్మె జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కలెక్టర్‌కు 30 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం



కలెక్టరేట్ అధికారులకు అందజేసిన వినతిపత్రంతో ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, 15 రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని ఆర్టీసీ ఎన్ఎంయూ జోనల్ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు బుధవారం ఆరు జిల్లాల సంఘం నాయకులు కలిసి తమ సమస్యలు వినిపించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులపై దౌర్జన్యం, అనారోగ్య సెలవులు పెట్టిన ఉద్యోగుల జీతాలు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పీజీ రాఫెల్, డిపో కమిటీ నాయకులు బి.రామారావు, ఎం.కృష్ణ, వై.విష్ణు, గురుమూర్తి, జి.ప్రభాకరరావు, ఎస్.కోట డిపో అధ్యక్ష, కార్యదర్శి ఎ.రాజయ్య, జి.వి.రమణ, తదితరులు ఉన్నారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ



సబ్ జైలును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. నేర ప్రవృత్తిని విడనాడాలని సూచించారు. జైలులో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమన్నారు. ఖైదీల పట్ల సిబ్బంది, తోటి ఖైదీలు ఎటువంటి వివక్ష చూపించరాదన్నారు. అనంతరం సబ్ జైల్‌లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. పారా లీగల్ వలంటీర్ల విధులపై ఆరా తీశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని, భోజనశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను సందర్శించి వంట సరుకులను పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ , సబ్ జైల్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఏరువాక



దత్తివలసలో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలస గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. పొలంలో దుక్కిచేసి ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని దైవంగా భావించి ఆరాధించడం, వ్యవసాయ పనులను ప్రారంభించడం అనాదిగావస్తున్న సంప్రదాయమన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యవసాయా ధికారి కె.రాబర్ట్ పాల్, ఎంపీపీ ఉరిటి రామారావు, డీపీఎం పి.షణ్ముఖరాజు పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్



శుభాంశు శుక్లాకు ఆల్‌ది బెస్ట్ చెబుతున్న బొబ్బిలి పట్టణ వాసులు

బొబ్బిలి: వ్యోమగామి శుభాంశు శుక్లా ఎటువంటి అవరోధాలు లేకుండా తన రోదసీ ప్రయాణాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని పట్టణ వాసులు ఆల్ ది బెస్ట్ చెప్పారు. బుధవారం రాత్రి కారుణ్య ఫౌండేషన్ సీఈఓ జేసీ రాజు ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దాదాపు 140 కోట్ల మంది భారతీయుల ప్రతినిధిగా నాలుగు దశాబ్దాల అనంతరం వినువీధిలో దేశ కీర్తిపతాకాన్ని ఎగురవేసేందుకు రోదసీ యానం చేస్తున్న భారత వాయుసేన అధికారి శుభాంశు శుక్లా దేశానికి గర్వకారణమని ప్రశంసించారు. స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీధర్, రమణారావు, శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిజజీవితంలో స్మార్ట్ స్కిల్స్ అవసరం



స్మార్ట్ స్కిల్స్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధి పనిలోనే కాకుండా నిజ జీవితంలో కూడా స్మార్ట్ స్కిల్స్ అవసరమని జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి అన్నారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో 'స్మార్ట్ స్కిల్స్ ఫర్ ఏ సెక్యూర్ ఫ్యూచర్' అనే అంశంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి చెందేందుకు వయస్సుతో సంబంధం లేదన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సాఫ్ట్ స్కిల్స్‌పై నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఈసీఈ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.హేమ పర్యవేక్షణలో వర్క్‌షాప్ రి సోర్స్ పర్సన్స్‌గా ఎస్‌బీఐఎల్‌డీ చీఫ్ మేనేజర్ (ఫ్యాకల్టీ) సురేష్ కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ వి.అభినాష్, డాక్టర్ కె.శ్రీకాంత్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.రాజేశ్వరరావు, ఎస్‌బీఐ అధికారులు, ఎం.సురేష్ బాబు, ఎ.శ్రీనివాసరావు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.